ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

మంగళవారం 22 జూలై 2025

'గిరి చైతన్యం' వాహనాలు ప్రారంభం

పార్వతీపురం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో సోమవారం గిరి చైతన్యం వాహనాలను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. వాటి ద్వారా గిరిజనులకు అందుబాటులో ధరల్లో నాణ్యమైన సరుకులు అందుతాయని తెలిపారు. ఖాళీ సమయాల్లో స్ర్కీన్‌పై అవగాహన కార్యక్రమాలు ప్రదర్శించి గిరిపుత్రులను చైతన్యవంతం చేస్తారని వెల్లడించారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెండు వాహనాలను కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వాటిని నిర్వహిస్తారన్నారు. ముందుగా గిరిబజార్ వాహనాల్లోని వస్తువులను కలెక్టర్ కొనుగోలు చేశారు.



వృద్ధురాలికి కరపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

చంద్రబాబు కాదు..
మీరే రద్దు చేశారు

● వైసీపీ మాజీ ఎమ్మెల్యేని నిలదీసిన వృద్ధురాలు

● చల్లగా జారుకున్న ఆ పార్టీ నాయకులు

పార్వతీపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో 'బాబుష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన వైసీపీ నాయకులకు ఓ వృద్ధురాలు చుక్కలు చూపించింది. వైసీపీ నాయకులు తనకు చేసిన అన్యాయాన్ని ఎండగట్టింది. వైసీపీకి చెందిన పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే జోగారావు, మరికొందరు నాయకులు పార్వతీపురం మున్సిపాలిటీ 18వ వార్డులో సోమవారం ఇంటింటికి వెళ్లారు. 'బాబుష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కరపత్రాలు పట్టుకుని తిరిగారు. ఓ ఇంటి వద్దకు వెళ్లిన జోగారావు.. వృద్ధురాలికి కరపత్రం ఇవ్వబోగా ఆమె తిరస్కరించింది. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఇంటికోసం ఎన్ని సార్లు తిరిగానో గుర్తుందా? అని నిలదీసింది. పక్కనే ఉన్న వైసీపీ శ్రేణులు వారించబోగా మీరు ఊరుకోండంటూ కస్సుమంది. దీనికి జోగారావు (మిగతా 8వ పేజీలో...)



కరపత్రం తీసుకోకుండా మాజీ ఎమ్మెల్యేని నిలదీస్తున్న వృద్ధురాలు

● ఆడలి వ్యూపాయింట్‌పై ఆసక్తి చూపని పర్యాటకులు

● వరుస ప్రమాదాలతో ముఖం చాటేస్తున్న వైనం

● ఇప్పటికే నలుగురి మృత్యువాత.. క్షతగాత్రులుగా మరికొందరు..

● ఆలస్యంగా రక్షణ చర్యలు

● పర్యాటక అభివృద్ధిపై ప్రభావం



:పర్యాటకులు లేక వెలవెలబోతున్న ఆడలి వ్యూపాయింట్

ఆడలి.. తగ్గిన తాకిడి

సీతంపేట రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు కేరాఫ్‌గా పేరొందింది సీతంపేట ఏజెన్సీ. చుట్టూ ఎత్తయిన కొండలు, జలపాతాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలెన్నో సందర్శకులను కనువిందు చేస్తుంటాయి. అయితే సీతంపేటలో ప్రధానమైన ఆడలి వ్యూపాయింట్‌కు కొద్ది నెలలుగా పర్యాటకుల తాకిడి తగ్గింది. వరుస ప్రమాదాలు.. అధిక ధరలు తదితర కారణాలతో ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ సహకారంతో సీతంపేట ఐటీడీఏ ప్రత్యేక నిధులు కేటాయించి గిరిశిఖర ప్రాంతంలో ఉన్న ఆడలి వ్యూపాయింట్‌ను అభివృద్ధి చేశారు. గత ఏడాది సెప్టెంబరులో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకులకు అంకితం చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం సందర్శకులతో కళకళలాడింది. అయితే ఆడలి వ్యూపాయింట్ మార్గంలో ఉన్న మలుపుల వద్ద ఇటీవల ప్రమాదాలు సంభవించాయి. నెలల వ్యవధిలోనే పాలకొండ, సీతంపేటకు చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో పర్యాటకులు గాయాలపాలయ్యారు. దీంతో పర్యాటకుల్లో భయాందోళన (మిగతా 8వ పేజీలో...)


ఏపీవో ఏమన్నారంటే..

ఆడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో పర్యాటకుల రక్షణ కోసం నాలుగు చోట్ల రక్షణ గోడలు నిర్మిస్తున్నాం. ప్రవేశ మార్గంలో లీజుదారులు నిర్ణయించిన ధరలను మరోసారి పరిశీలించి వారితో చర్చిస్తామని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు.

అర్హుల జాబితాపై కసరత్తు

● అన్నదాతా సుఖీభవ పథకానికి రైతుల గుర్తింపు

● త్వరలోనే ఆర్థిక సాయం జమ



సాలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతు కుటుంబానికీ అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ మేరకు జిల్లా యంత్రాగానికి తగిన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వనమిత్ర యాప్‌ను కూడా రూపొందించింది. కాగా జిల్లాలో అర్హుల జాబితా తయారీపై వ్యవ సాయ, రెవెన్యూ శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు రైతు భరోసా సాయం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు పకడ్బందీగా జాబితాను తయారు చేస్తున్నారు. ఒకటికి రెండు సార్లు రైతుల పేర్లు సరిచూసుకుంటున్నారు. అర్హతను బట్టి తిరిగి యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా జిల్లాలో లక్షా 21వేల 600 మంది రైతులు ఉన్నట్లు అధికా రులు గుర్తించారు. వారిలో లక్షా 19 వేల 466 మందిని అన్నదాతా సుఖీభవ పథకా నికి అర్హులుగా గుర్తించారు. 2 వేల 134 మంది రైతులకు ఈకేవైసీ పూర్తికాలేదు. అన్నదాత సుఖీభవ (మిగతా 8వ పేజీలో...)

నలుగురు కార్యదర్శుల

సస్పెన్షన్

8లో

● ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎరువుల కోసం

రైతుల ఆందోళన

8లో

శుభకార్యాలకు వేళాయే..

● 25 నుంచి శ్రావణమాసం ● మోగనున్న పెళ్లి బాజాలు ● నవంబరు వరకు మంచి ముహూర్తాలు



గరుగుబిల్లి/పాలకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాలకు వేళయ్యింది. జిల్లాలో వివాహాల సందడి మొదలు కానుంది. శ్రావణమాసం నేపథ్యంలో పల్లెలు, పట్టణాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో జిల్లావాసులు శుభ కార్యాలకు సన్నద్ధమవుతున్నారు. గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఇతరత్రా శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివాహాలకు సంబంధించి ఈ నెల 26 నుంచి 31 వరకు, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు వరకు వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అయితే భాద్రపద మాసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకు శుభ ముహూర్తాలు లేవు. ఈ నేపథ్యంలో శ్రావణమాసంలో అధికంగా శుభ కార్యాలు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లావాసులు కల్యాణ మండపాలను బుక్ చేసుకున్నారు. మేళతాళాలు, బ్యాండ్లు, డీజేలు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, నిత్యావసర సరుకులు, పూలు, వంట వారికి అడ్వాన్సులు చెల్లించే శారు. మరోవైపు వస్త్ర, బంగారు, స్వీట్లు తదితర షాపులన్నీ కిటకిటలాడనున్నాయి. మొత్తంగా ఈ నెల 25 నుంచి వ్యాపారాలు ఊపందుకోను న్నాయి. దీంతో పలువురికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

ఇవీ శుభ ముహూర్తాలు ..

ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, సెప్టెంబరు 24, 26, 27, 28, అక్టోబరు 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31, నవంబరు 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ తేదీల్లో శుభకార్యాలు చేసుకోవచ్చని పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ తెలిపారు.



రక్త నమూనాల సేకరణ కేంద్రం వద్ద జ్వరపీడితులు ఇలా..

విజృంభిస్తున్న జ్వరాలు

● సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి

సీతంపేటరూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, వర్షాల కారణంగా జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రి జ్వరపీడితులతో కిటకిటలాడింది. మొత్తంగా 371 వరకు ఓపీ నమోదవగా.. వారిలో 120 మంది టైఫాయిడ్, విష జ్వరాలతో బాధపడుతున్నారు. మలేరియా పాజిటివ్ కేసులు 17 రాగా వీరిలో 47మంది ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరారు. ఇదిలా ఉండగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురు కులాలు, వసతిగృహాలు, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జ్వరాలతో వణికిపోతున్నారు. ప్రతి పాఠశాలలో పదుల సంఖ్యలో విద్యార్థులు చలి జ్వరం, ఒళ్లునొప్పులు, వికారం, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. స్థానిక ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న శరణ్య, భార్గవి, నవ్యమేఘనతో పాటు తొమ్మిదో తరగతి చదువుతున్న చాందిని చలి జ్వరం లక్షణాలతో సోమవారం ఏరియా ఆసుపత్రికి వచ్చారు.

వ్యాధులపై అవగాహనకు కళాజాత

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై మరింతగా అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. సోమవారం సాయంత్రం పార్వతీపురం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కళాజాత ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుత సీజన్‌లో ఏజెన్సీపై జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాత ఎంతగానో దోహదపడుతుంది. విషజ్వరాలు ప్రబలకుండా విస్తృత ప్రచారం చేయాలి.' అని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో పి.మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఇక ఇంటి నుంచే

రిజిస్టర్ పోస్టు

బొబ్బిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ సేవలను విస్తరించుకుంటోంది. ఇక ఇంటి నుంచే వినియోగదారులు రిజిస్టర్ పోస్టు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. మంగళవారం నుంచే ఆ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ముందుగా వినియోగదారులు మొబైల్ యాప్‌లో పోస్టల్ సిబ్బందికి రిక్వెస్ట్ మెసేజ్ పంపాలి. తర్వాత తపాలాశాఖ నుంచి బార్‌కోడ్ నెంబరు, ఓటీపీ వస్తుంది. ఇంటికొచ్చే పోస్టల్ ఉద్యోగి దగ్గర వీటిని సరిచూసుకొని రిజిస్టర్ పోస్టులేవైనా బుక్ చేసుకోవచ్చు. రూ.500 దాటితే నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ఇక కలెక్టర్ పరిధిలోనే..

● అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం ఆయనదే

కొత్తవలస, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఒకరి ఆస్తులను మరొకరు మోసపూరితంగా కాజేసి ఫోర్జరీ దస్తా వేజులతో రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై రాష్ట్రప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇకపై అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటే వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్లకు అప్పగించింది. గతంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసే అధికారం కేవలం సివిల్ కోర్టులకు మాత్రమే ఉండేది. విచారణ జరిగి తీర్పు వచ్చేసరికి సంవత్సరాల పాటు జాప్యం జరిగేది. ఒకవేళ సివిల్ కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చినా మళ్లీ పైకోర్టులో అప్పీలు అంటూ మరికొన్ని సంవత్సరాలు జాప్యం జరిగేది. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి వాటికి చెక్‌పెట్టడమే ధ్యేయంగా ఈ సవరణ చట్టం అమలులోకి వచ్చింది. క్రయ విక్రయదారులకు తీవ్ర నష్టం జరిగినట్టు రుజువైతే అటువంటి సబ్ రిజిస్ట్రార్‌లకు ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చునని తాజా చట్టంలో పేర్కొన్నారు.

ఒత్తిడితోనే సగం జబ్బులు

● పెరుగుతున్న అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ బాధితులు

● నేడు ప్రపంచ మస్తిష్క(బ్రెయిన్) దినోత్సవం

6లో

చేయి చేయి కలిపి.. రోడ్డు వేసి..

సీతంపేట రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలం పుబ్బాడ పంచాయతీ పరిధి గుజ్జి గ్రామానికి చెందిన గిరిజన యువకులు చేయి చేయి కలిపి శ్రమదానంతో సోమవారం మట్టిరోడ్డును నిర్మించుకున్నారు. ఆ గ్రామంలో వీధి కాలువలు లేవు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుజ్జి గ్రామ మట్టి రహదారి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్థులు శ్రమదానం చేసి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. తమ గ్రామానికి రహదారి, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



మట్టి రోడ్డును నిర్మించుకుంటున్న గుజ్జి గ్రామస్థులు

ప్రతి వసతిగృహానికీ ప్రత్యేకాధికారి

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి వసతిగృహానికీ ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వసతి గృహాలు.. సమస్యల లోగిళ్లు' అనే కథనంపై ఆయన స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ అనంతరం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రతి వసతిగృహానికి తహసీల్దార్ ప్రత్యేక అధికారిగా ఉండాలి. అదే ప్రాంతంలో ఉన్న మరో వసతి గృహాన్ని సమీపంలో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలి. అక్కడి సమస్యలను పరిష్కరించాలి. ఇకపై ప్రతినెలా వసతి గృహాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. ఈ సమావేశానికి పాఠశాల ఉపాధ్యాయులు కూడా హాజరవ్వాలి.' అని తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి..

అంగన్‌వాడీ, పాఠశాలల భవనాలకు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వీలుంటే మరొక భవనంలోకి మార్చాలన్నారు. 'వరద ప్రవాహం ఎక్కువగా ఉంటే.. వాగులు, నదులు దాటుకొని వచ్చే పిల్లలకు సెలవు ప్రకటించాలి. పాఠశాల లేదా వసతిగృహానికి పిల్లలు రాకపోతే దానికి తగిన కారణాలు తెలుసుకోవాలి. ఆరోగ్య సమస్యలుంటే వెంటనే పిల్లలకు వైద్య సేవలు అందించాలి. 'తల్లికి వందనం' పథకం వర్తించలేదని చాలా దరఖాస్తులు వస్తు న్నాయి. ఆయా అర్జీలను పరిశీలించి ఒక జాబితాను తయారు చేయాలి. అర్హులైన వారి పేర్లను ప్రభుత్వానికి పంపించాలి. ఎక్కడా తాగునీటి సమస్య ఉండరాదు. కొమరాడ మండలంలో గిరిజన మహిళలకు చెందిన భూ ఆక్రమణపై విచారణ చేపట్టాలి. సీతానగరం మండలం రంగంపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై నివేదిక అందించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో గాని పంచాయతీల్లో గానీ ఎవరైనా సక్రమంగా పనిచేయకపోతే వెంటనే ఉన్నతాధికారులకు తెలియ జేయాలి. బడి ఈడు పిల్లలు బడి బయట ఉండరాదు.' అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పీ-4పై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమం, గ్రామసభలు తదితర వాటిపై అధికార యంత్రాంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. బంగారు కుటుంబాల జాబితాలపై వచ్చే అభ్యంతరాలపై గ్రామసభలను నిర్వహించాలని ఆదేశించారు. అభ్యంతరాలు, ఇతర వివరాలను రికార్డు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 33,309 కుటుంబా లను దత్తత తీసుకోవాల్సి ఉండగా, ఇప్పటికే 13 వేల కుటుంబాలు మ్యాపింగ్ (మిగతా 8వ పేజీలో...)

పథకాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ

- చొచ్చుకుపోతున్న టీడీపీ ప్రజాప్రతినిధులు
- గ్రామీణ ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన



ఎల్.కోట మండలం గంగుబూడిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి (ఫైల్)

● 'నాకు వికలాంగ పింఛన్ ఆరు వేలు. నా భార్యకు వృద్ధాప్య పింఛన్ నాలుగు వేలు. మొత్తం పది వేలతో కుటుంబ జీవనం సాఫీగా సాగిపోతోంది. ఈ ప్రభుత్వం పింఛన్ మొత్తం పెంచడంతో ముదసలి వయస్సులో కొడుకులు, కూతుర్లపై ఆధారపడడం తప్పింది. వారితో ఒక్క మాట అనిపించుకోకుండ మా బతుకుమేము బతుకుతున్నాం. తిరిగి వారి పిల్లల చేతుల్లో ఎంతోకొంత పెట్టి తృప్తి చెందుతున్నాం'.

● 'మాకు రెండు నుంచి మూడు నెలలకు గ్యాస్ బండ అవుతుంది. దీంతో రెండు నెలలు దాటగానే గుండెల్లో గుబులు పట్టుకునేది. గ్యాస్ బండ విడిపించుకోనేందుకు రూ.1000 వరకు ఎక్కడ అప్పుచేయాలో, తిరిగి వాటిని ఎలా తీర్చాలోనని ఒకటే యాతన. ఇప్పుడా ఆ బాధ తప్పింది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా మావంటి కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తోంది. ఇప్పటికే మా కుటుంబానికి ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందింది. గ్యాస్ విడిపించిన డబ్బులు నా ఖాతాకు పడడంతో చేసిన అప్పు నెల తిరగకుండానే తీర్చేశాను'.

● 'నాకిద్దరు పిల్లలు. ఇంకా పాఠశాలలో చదువుతున్నారు. పేద కుటుంబం కావడంతో వీరినేలా చదివించాలోనని మదనపడ్డాను. తల్లికి వందనం పథకం ద్వారా ఇద్దరికి రూ.26వేల వరకు ఖాతాలో పడ్డాయి. వాటితో నా ఇద్దరు బిడ్డల చదవుకు ఖర్చు చేస్తున్నారు. వారికి నచ్చిన బట్టలు తీశాను'.

● విశాఖపట్టణానికి మా గ్రామానికి రాకపోకలు ఎక్కువ. విశాఖ-అరకు రోడ్డులో పెందూర్తి నుంచి బొడ్డవర వరకు విస్తరించకపోవడంతో రవాణాపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బైపాస్ రోడ్డుతో కూడిన విస్తరణకు నిధులు విడుదల చేసింది. తొందరగా పనులు పూర్తిచేయిస్తే సురక్షిత ప్రయాణం జరుగుతుంది'.

...ఇలా పలువురు ఎల్.కోట మండలంలోని దానుళ్లపాలెం, గంగుబూడి గ్రామాల్లో ఇటీవల ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

శృంగవరపుకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గతఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు, లబ్ధిదారులకు వివరించి, వారి సమస్యలు తెలియజేసేందుకు టీడీపీ నాయకులు నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి అనూహ్యస్పందన లభిస్తోంది. టీడీపీ నాయకులు ఈనెల రెండో తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఏడాదిగా నిస్తేజంగా ఉన్న క్యాడర్ గ్రామీణ ప్రాంతాల్లో చొచ్చుకుపోతోంది. ప్రజలకు భరోసాఇస్తూ, భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలను నాయ కులు వివరిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో నిర్వహించిన కార్య క్రమాలు వివరిస్తూ కరపత్రాలను అందజేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో చేపట్టిన పనులు, అమలు చేసిన కార్యక్రమాలు ప్రజలకు తెలియజేస్తున్నారు. ఏడాదిలో అమలుచేసిన కార్యక్రమాల వల్ల ప్రజలు సంతృప్తి వ్యక్తంచేసి నాయకులకు సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

ఇలా వివరిస్తూ.. ముందుకు సాగుతూ..

● జిల్లాలో 2,72,322 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ప్రతి నెలా రూ.115.14 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వృద్ధాప్య, వితంతువు, ఒంటరి మహిళ, డప్పు కళాకారులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు రంగస్థల కళాకారులు, ట్రాన్స్‌జండర్లకు రూ.నాలుగు వేలు చొప్పున పింఛన్, విభిన్న ప్రతిభావంతులకు రూ.ఆరు వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్థులకు రూ.పది వేలు, వివిధ రకాల దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో బాధపడుతున్నవారికి రూ.6,000, 10,000, 15000 చొప్పున పింఛన్ అందజేస్తున్నారు.

● తల్లికి వందనం ద్వారా చదువుకుంటున్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలుచొప్పున, దీపం పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికు ఉచితంగా మూడుగ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నారు. యువతకు ఉద్యోగాల కల్పించడానికి ఇప్పటికే మెగా డీఎస్సీ నిర్వహించారు.

● త్వరలో రైతులకోసం అన్నదాత సుఖీభవ పథకం కింద ఖాతాలో రూ.20 వేల చొప్పున జమచేయనున్నారు.

● ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.

● ఎస్సీవర్గీకరణ చేపట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశారు.

● వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. దీంతో పాటు రోడ్లు అడుగడుగునా గోతులమయమాయ్యయి. నిర్వహణ లేక వల్ల పారిశుధ్యంలోపించింది.దీంతోఅప్పట్లో గ్రామీణప్రాంతాల్లో వ్యాధులు విజృంభించేవి. ప్రస్తుతం అటువంటిసమస్యలు తలెత్తడం లేదు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు.దీనిలో భాగంగా మహత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. 4015 సీసీ రోడ్లకు రూ.26591.37 లక్షలు మంజూరు చేశారు. 179 మెటల్ రోడ్లకు రూ.3426.19 లక్షలు విడుదల చేశారు. పీఎంజీఎస్‌వై పథకం కింద 22 పనులకు రూ.9214.01 లక్షలు మంజూరుకాగా 164.11 కిలోమీటర్లు రోడ్లు నిర్మాణం చేపట్టారు.

● జిల్లాలో ప్రధాన మంత్రి జనజాతి అదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జనమన్) పథకం నుంచి ఎస్.కోట మండలంలోని గూనపాడుకు 10.40 కిలోమీటర్లు రోడ్డుకు రూ.1130.00 లక్షలు, వేపాడ మండలంలోని గదబవలస 2.90 కిలోమీటర్లు రోడ్డుకు 265.00 లక్షలు, మెంటాడ మండలంలోని గజం గుడ్డివలస 2.30 కిలోమీటర్లు రోడ్డుకు రూ.235.00 లక్షలు కేటాయించారు. రూ.24.92 కోట్లు నాబార్డు నిధులతో 19 గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరుచేశారు. ఆరు గ్రామీణ ప్రధాన (ఆర్అండ్‌బీ) రహదారుల మెరుగుపరిచేందుకు రూ.13.85 కోట్లు విడుదలయ్యాయి.

● రెండు దశబ్దాల కిందటే విశాఖ-అరకు రోడ్డును పెందూర్తి వరకు విస్తరించి వదిలేశారు. ప్రధానంగా విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో గల బొడ్డవర వరకు విస్తరించకపోవడంతో పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులుపడేవారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ నాయకులు ఏటా డిసెంబరు నాటికి పనులు మొదలెడతామని చెబుతూ ఐదేళ్లు కాలం వెల్లబుచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెందూర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు అడుగులువేశారు. నాలుగు వరసల రోడ్డుతో పాటు కొత్త వలస వద్ద ఒకటి, ఎస్.కోట వద్ద మరోకటి, బొడ్డవర వద్ద ఇంకొకటి బైపాస్ రహదారుల నిర్మాణానికి సుమారు రూ.1000 కోట్లు వరకు కేంద్రం నుంచి నిధులు రాబట్టారు. టెండర్‌ను కూడా పూర్తిచేయడంతో పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

లక్షల్లో నిరుద్యోగులు.. వేలల్లో నమోదు

- ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస
- జిల్లా ఉపాధి, శిక్షణా కార్యాలయంలో నమోదుకు ఆసక్తి చూపని యువత

విజయనగరం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో నిరుద్యోగ సమస్య యువతను వేధిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు ఆశించినస్థాయిలో లేకపోవడంతో వారిలో నైరాశ్యం అలుముకుంటోంది. సరళీకరణ ఆర్థిక విధానాల అమలు తర్వాత ప్రభుత్వ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో జిల్లా కేంద్రంలోని ఉపాధి, శిక్షణ కార్యాలయంలో నిరుద్యోగ యువత నమోదుకు ఆసక్తి చూపడం లేదు.

ఉపాధి అవకాలు తగ్గుతుండడంతో లక్షల్లో నిరుద్యోగులు ఉన్నా వేలల్లో జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకుంటున్నారు. వీరిలో ఫార్మసీ, షాపింగ్ మాల్స్, ప్రైవేటు బీమా కంపెనీల్లో వందల్లో ఉద్యోగావకాశాలను అధికారులు కల్పిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వహయాంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ నియామకాలు తప్ప, పెద్దగా ఉద్యోగ నోటిఫికేషన్లు జారీచేయలేదు. దీంతో వేలాది మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు కాకపోగా, ఉన్న చక్కెర, జ్యూట్ తదితర పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో వేలాది మంది ఉపాధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా రోడ్డున పడ్డారు.

ఇదీ పరిస్థితి

జిల్లా ఉపాధికార్యాలయంలో ఇప్పటివర కూ 30,332మంది నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.ఇందులో 8,777 మంది మహిళలు, 21,545 మంది పురుషులు ఉన్నారు. 2024-25 సంవత్సరంలో 37 జాబ్‌మేళాలను నిర్వహించి 1,270 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకూ 29 జాబ్‌మేళాలను నిర్వహించి 3,279 మందికి వివిధ ప్రైవేటువిద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌లో ఉపాధిఅవకాశాలు కల్పించారు. ఏడాదికాలంలో కేవలం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి డీఎస్సీ నోటిఫికేషన్ తప్ప, మరేతర ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం జారీ చేయలేదు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం జిల్లాలోని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



జిల్లా ఉపాధి,శిక్షణ కార్యాలయం

ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం

జిల్లాలో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధిఅవకాశాలు కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా ఉపాధి కార్యాలయంలో విద్యార్థులు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం.

-ఆర్.వహీదా, ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి

వైసీపీ పాలనలో అడియాశలు

వైసీపీఅధికారంలో ఉన్నప్పుడుఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ఆశలన్నీ అడియాసలు అయ్యాయి. వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి నిర్వీర్యంచేశారు.ఉద్యోగ నోటిఫికేషన్ రాకపోవడంతో ఉపాధి అవకాశాల్లేక నిరుద్యోగులు అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని,ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ఇంత వరకూ నెరవేరలేదు.

-కోట అప్పన్న, ఏఐవైఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి


నిరుద్యోగులకు ఒరిగేందేమీ లేదు

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరుద్యోగులకు ఒరిగేందేమీ లేదు. వైసీపీ, కూటమి దొందూ దొందూ అనే రీతిలో వ్యవహరిస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది. కూటమి ప్రభుత్వం కూడా అదే రీతిలో వ్యవహరిస్తోంది. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు.

-టి.వెంకటరావు, నిరుద్యోగి, విజయనగరం

ఒత్తిడితోనే సగం జబ్బులు

- పెరుగుతున్న అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ బాధితులు
- నేడు ప్రపంచ మస్తిష్క(బ్రెయిన్) దినోత్సవం



విజయనగరం రింగురోడ్డు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవుడిపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికితోడు జీవన శైలిలో వస్తున్న మార్పుల వల్ల అల్జీమర్స్ పార్కిన్‌సన్స్ వంటి వాధుల బాధితులు పెరుగుతున్నారు. ఫలితంగా మెదడు సంబంధిత సమస్యలతో ఎక్కువగా ఇటీవల కాలంలో ఆస్పత్రుల్లో చేరుతున్నారు.దీర్ఘకాల ఒత్తిడే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆలోచనలు, ఆకలి, ఆనందం ఇలా ప్రతి కదలికకు, భావనకు మూలం నిశ్శబ్దంగా పనిచేసే మెదడు. అదో అద్భుతమైన సూపర్ కంప్యూటర్ వంటిది. జ్ఞాపకాలు దాచుకునే ఘని. కొత్త విషయాలను నేర్చుకునే పాఠశాల. భావోద్వేగాలు పంచుకునే స్నేహితుడు. అన్నింటికి మెదడే ప్రధానం. అయితేనేడు మారుతున్న జీవనశైలి, నిరంతరఒత్తిడి, సాంకేతికతతో కూడిన జీవితం ఇవన్నీ మెదడుపై ఊహించని భారాన్ని మోపుతున్నాయి. ఈనేపథ్యంలో మెదడు ఆరోగ్యం ప్రాధాన్యతను అర్థం చేసుకోవడం, దానిని కాపాడుకోవడం కోసం ప్రతిఏటా జూలై 22న ప్రపంచప్రపంచ మస్తిష్కదినోత్సవం (బ్రెయిన్‌డే)జరుపుకొంటారు. ఈఏడాది ప్రపంచ మెదడు దినోత్సవం థీమ్ అన్ని వయస్సుల వారికి మెదడు ఆరోగ్యం ప్రపంచన్యూరాలజీ ఫెడరేషన్ ప్రకటించింది. గర్భాధారణకు ముందునుంచి బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం వరకూ ఇలా మనిషి జీవితంలో ప్రతి దశలోనూ మెదడు ఆరోగ్యం ఎంతో ముఖ్యమో ఈ థీమ్ తెలియజేస్తోంది.

ఇవీ మెదడు చేసే పనులు

● శరీరంలో కమాండ్ సెంటర్ మెదడు. ఇది ఆలోచనలు, భావోద్వేగాలు, జ్ఞాపకాలు, మాటలకు చివరకు మనం చూసే, వినే స్పర్శించే, రుచి చూసే ప్రతి దానికి కేంద్రం. దాదాపు 1.4 కిలోల బరువు ఉండే ఈ అవయవం, వంద బిలియన్లకుపైగా నరాల కణాలతో (న్యూరాన్లు) అల్లుకుపోయిన అద్భుతమైన నెట్‌వర్క్.

● ప్రతి సెకన్‌కు లక్షలాది సంకేతాలు పంపుతూ, స్వీకరిస్తూ, విశ్లేషిస్తుంది. నిద్రపోయినా, మెలకువగా ఉన్నా, మెదడు మాత్రం నిరంతరంగా పనిచేస్తోంది. శ్వాస తీసుకోవడం దగ్గర నుంచి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడం వరకూ ప్రతి పని మెదడు నియంత్రణలో జరుగుతుంది.

మెదుడు ఆరోగ్యం సరిగ్గా లేకపోతే...

● ఆధునిక ప్రపంచంలో మెదడు ఆరోగ్యం సవాల్‌గా మారింది. సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, పోషకాహార లోపం, నిద్రలేమి, దీర్ఘకాలిక ఒత్తిడి మెదడు పని తీరును ప్రభావితం చేస్తాయి. జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం, మానసిక ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి.

● వృద్ధాప్యంలో అల్జీమర్స్‌పార్కిన్‌సన్స్ వంటి మెదడు సంబంధిత వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధులు వ్యక్తిగతజీవితంపైనే కాకుండా కుటుంబాలు,సమాజంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే మెదడును చిన్నతనం నుంచే ఆరోగ్యంగా ఉంచుకోవడంపై శ్రద్ధపెట్టాలి.

● జ్ఞాపకశక్తి మందగించడం, చిన్న, చిన్న విషయాలు మరచి పోవడం,దారితప్పిపోవడం, మనుషులను గుర్తుపట్టకలేక పోవడం వంటివి జ్ఞాపకశక్తి సమస్యలు తలెత్తుతాయి. అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులు దీనికి నిదర్శనం. వయస్సుతో ఇది సాధారణమే అనుకున్నా, చిన్న వయస్సులో కూడా ఈ సమస్యలు రావచ్చు.

● డిప్రెషన్,యాంగ్జటీ, బయాపోలార్ డిజార్డర్, స్కీజోఫ్రీనీయా వంటివి మెదుడు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం వల్లే వస్తాయి. ఆలోచనల్లో స్పష్టత లేకపోవడం, ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన రావడం వంటివి లక్షణాలు ఉంటాయి.

● కోపం, చిరాకు, ఆవేశం, నిద్రలేమి, భావోద్వేగాలు నియంత్రించకోలేకపోవడం, పక్షవాతం, మైగ్రేన్ వంటివి మెదడు ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల కలిగే సమస్యలు.

మెదడుకి శక్తినిచ్చే మార్గాలు

● మెదడుకు విశ్రాంతి అవసరం, నాణ్యమైన నిద్ర ద్వారా మెదడు పునర్ జీవింప చేసుకుంటుంది. రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్ర పెద్దలకు అవసరం. మంచి నిద్ర మెదడు కణాలను బాగుచేసి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. సరైన నిద్ర లేకపోతే, ఆలోచన శక్తి, ఏకాగ్రత తగ్గుతాయి.

● ఓమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు గల చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కలిగిన పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్, ఆకుకూరలు, గుడ్లు వంటివి మెదడు ఆరోగ్యానికి అత్యవసరం.

● దూమపానం, మద్యపానం, ప్రాసెస్ చేసిన ఆహారాలు అధిక చెక్కర సంతృప్త కొవ్వులు వంటి వాటి వల్ల మెదడు పనితీరు మందగించి మెదడు సమస్యలకు కారణమవుతాయి.

● మెదడుకు వ్యాయామం అవసరం. రోజుకి 30 నిమిషాలు నడవడం, యోగా, సైక్లింగ్, డాన్స్ వంటివి చేయడం వల్ల మెదడు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది మెదడు కణాలకు ఆక్సిజన్, పోషకాలను అందించి కొత్త మెదడు కణాలు పెరిగేందుకు తోడ్పడతాయి.

● నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలి. కొత్త భాష, సంగీత వాయిద్యం నేర్చుకోవడం, పజిల్స్, సూడోకు వంటి ఆటలు ఆడడం, పుస్తకాలు చదవడం, సృజనాత్మక పనులు చేయడం మెదడుకు పదును పెడతాయి.

● దీర్ఘకాలిక ఒత్తిడి మెదడుకు హానికరం. ఇది జ్ఞాపశక్తికి, ఏకాగ్రతను దెబ్బ తీస్తుంది. అందుకే ధ్యానం, యోగా, శ్వాస, వ్యాయామం, ప్రకృతిలో గడపడడం స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మెదడు చురుగ్గా ఉంటుంది.

ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవరుచుకోవాలి



ప్రస్తుత జీవనశైలిలో మార్పులు చేసుకోకపోతే, భవిష్యత్‌లో మెదడు సంబంధిత సమస్యలతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది. మెదడు అనేది ఒక అవయవం కాదు. మన అస్థిత్వం, దానిని నిర్లక్ష్యం చేస్తే అది మన జీవితాలనే ప్రభావితం చేస్తుంది. మానవ సంబంధాలు తగ్గడం, పని ఒత్తిడి, నిద్రలేమి, శారీరక శ్రమ లేకపోవడం, మత్తు పదార్థాల వినియోగం వల్ల గతంలో వృద్ధుల్లో కనిపించే జ్ఞాపకశక్తి సమస్యలు, ఏకాగ్రత లోపాలు ఇప్పుడు యువతలో కూడా కనిపిస్తున్నాయి. నడవడం, పరిగెత్తడం, యోగా వంటివి మెదడులో రక్తప్రసరణ పెంచుతాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవరుచుకోవాలి.

-హేమంత్ మాధవ్, సైకియాట్రిస్ట్, విజయనగరం

బాధితుల సమస్యలను పరిష్కరించాలి: ఎస్పీ

- చర్యలపై నివేదిక పంపించాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 39 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 39 ఫిర్యాదులు స్వీకరించారు. భూ తగాదాలకు సంబంధించి 11, కుటుంబ కలహాలు, మోసాలకు పాల్పడడంపై ఐదేసి చొప్పున, ఇతర అంశాలకు సంబంధించి 18 ఫిర్యాదులు అందాయి. వాటి పూర్వాపరాలను విచారణ చేసి ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఏడు రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి, తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.



పైడిమాంబ అమ్మవారు

25 నుంచి శ్రావణమాసం పూజలు

- విజయనగరంలోని పైడిమాంబ ఆలయంలో ఏర్పాట్లు

విజయనగరం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడిమాంబఆలయంలో శ్రావణమాస పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. నెలరోజుల పాటు నగరంలోని మూడులాంతర్లు వద్ద గల పైడిమాంబ చదురుగుడిలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు జరగనున్నాయి.ఈ పూజల్లో భక్తులను భాగస్వామ్యులు చేసేందుకు ఆలయ ఈవో శిరీష, అర్చకులు, సిబ్బంది నిర్ణయించారు. ఏటా పూజల నిమిత్తం తీసుకునే మొత్తాన్నే ఈ ఏడాది కూడా కొనసాగించనున్నారు.శ్రావణమాసంలో ప్రతి మంగళవారం పంచామృతాభిషేకాలు,ప్రతిశుక్రవారం విశిష్ట కుంకుమార్చన కార్యక్రమాలు జరగనున్నాయి. పంచామృతాభిషేకాలు, విశిష్ట కుంకుమార్చనలకు టిక్కెట్ ధర రూ.150గా నిర్ణయించారు. శ్రావణమాసంలో ప్రతిరోజూ చక్రార్చన నిర్వహించనున్నారు. ఆ మాసంలో వచ్చే పౌర్ణమి పురస్కరించుకుని పైడిమాంబకు స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం జరగనుంది. ఈనెల 25 నుంచి ఆగస్టు 22 వరకూ పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ అంబేడ్కర్ అధికారులకు ఆదేశం
- పీజీఆర్ఎస్‌లో 178 వినతుల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి):అర్జీలపరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో అర్జీదారులు నుంచి వినతులు స్వీకరించారు.ఈసందర్భంగా 178వినతులు అందగా, ఇందులో 86 వినతులు రెవెన్యూశాఖకు, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖలకు ఆరేసి చొప్పున, డీఆర్‌డీఏకు 27, మునిసిపాల్టీకి సంబంధించి 11, విద్యాశాఖకు 10, వైద్య శాఖకు రెండు వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీసేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి, డిప్యూటీకలెక్టర్ మురళి, ప్రమీలాగాంధీ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండానాణ్యతతో పరిష్కరించాలని అధికారులను కోరారు.

డ్రోన్లు వినియోగించాలి

నానో ఎరువులు వాడకానికి డ్రోన్లను వినియోగించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.సోమవారం విజయనగరంలో వ్యవసాయశాఖ రూపొందించి చీడ పురుగులు నుంచి పంటను కాపాడేందుకు దోహదపడే జీవన ఎరువులు ఆవశ్యకతను, నానో ఎరువులు ప్రచారం బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానోఎరు వుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు

వైద్య ఆరోగ్యశాఖలో ఉత్తమసేవలను అందించిన డాక్టర్లు,సిబ్బందికి సోమవారం కలెక్టరు అంబేడ్కర్ తనచాంబర్‌లో ప్రశంసాపత్రాలు అందించారు. ఈనెల 11న జరిగిన అంతర్జాతీయ జనాభాదినోత్సవం పురస్కరించుకుని వైద్య శాఖలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.



వినతిని పరిశీలిస్తున్న అంబేడ్కర్

మహిళల ఆర్థికాభివృద్ధికి సూక్ష్మరుణ ప్రణాళిక

- డీఆర్‌డీఏ పీడీ సావిత్రి



మాట్లాడుతున్న సావిత్రి

విజయనగరం జులై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొదుపు సంఘాల ఆర్థిక అవసరాలు, వారి ఆర్థికాభివృద్ధికి సెర్ప్ నుంచి కొత్తగా ఆన్‌లైన్ ద్వారా సూక్షరుణ ప్రణాళిక(మైక్రో క్రెడిట్‌ప్లాన్), యాన్యువల్ క్రెడిట్ లైవలీహుడ్ ప్లాన్ (ఏసీఎల్‌సీ)పథకాలను అమలు చేస్తున్నామని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సావిత్రి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులకు వెలుగు, డీఆర్‌డీఏ ద్వారా అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకోసం గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామని చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంక్‌లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి స్కీమ్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఏపీఎల్‌సీ ద్వారా జిల్లాలో లక్షా 25వేల మంది చదువుకున్న పొదుపు సంఘాల సభ్యులకు శిక్షణఇచ్చి వారి జీవనోపాధులను మెరుగుపరుచుకునేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను నమోదుచేస్తున్నట్లుతెలిపారు. జిల్లాలో వ్యవసాయ,ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్థక శాఖలతో సెర్ప్‌తో సమన్వయం చేసుకునేందుకు గ్రామ, జిల్లా స్థాయి పంక్షనల్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ స్థాయి కమిటీ ద్వారా వచ్చిన లబ్ధిదారుల వివరాలను నిబంధనల మేరకు జిల్లా స్థాయి కమిటీ అమోదించవలసి ఉంటుందని పీడీ సావిత్రి తెలిపారు.

పేదరిక నిర్మూలనకు కృషి

సంతకవిటి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు సభ్యులందరూ కృషి చేయాలని వెలుగు ఏపీఎం టి.దదికుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని వెలుగు సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, సెర్ప్‌లలో పనిచేస్తున్న సీసీ, వీవోఏలకు మండల స్థాయిలో గ్రామ పేదరిక తగ్గింపు ప్రణాళికపై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రణాళికా విధానంలో మహిళలను సామూహికంగా భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై వినతి

గరివిడి, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడు సమస్యను పరిష్కరించాలని గొల్లలములగాం గ్రామానికి చెందిన కూటమి నాయకులు, రైతులు.. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడును సోమవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి.. పొలాల్లో సర్వే చేసి, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసి, మెరుగైన విద్యుత్ అందించాలని అధికారులకు సూచించారు.

వసతిగృహాలకు అదనపు భవనాలు నిర్మించాలి

శృంగవరపుకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట గిరిజన బాలుర సంక్షేమ వసతిగృహానికి మరుగుదొడ్లు, అదనపు భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. 300 మంది విద్యార్థులకు 10 మరుగుదొడ్లు ఉన్నాయని, అవి చాలడం లేదని వసతి గృహ కమిటీ సెక్రటరీ చిన్న వివరించారు. తిలక్ శంకర్, చైతన్య పాల్గొన్నారు.

గజపతినగరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా బంగారునాయుడు

గజపతినగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడుగా లెంక బంగారునాయుడు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. జనసేన పార్టీ నుంచి కడమల అప్పలమ్మ, టీడీపీ నుంచి గొర్లె బంగారునాయుడులు డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు, మాజీ మంత్రి పడాల అరుణ, బీజేపీ జాతీయ నాయకురాలు రెడ్డి పావని, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

భోగాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు లేకుండా చూస్తుండాలని డీఎల్‌పీవో శిరీషారాణి సూచించారు. దల్లిపేట పంచాయతీలో ఆమె సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి ట్యాంకులు, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యదర్శి ఎండీ రిజ్వాన్‌కు పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి, స్థానిక నాయకులు దల్లి శ్రీను పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

నెల్లిమర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని డైట్ కాలనీలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ తన సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడి చేసి, నిర్వాహకురాలితో పాటుగా విటుడ్ని అరెస్టు చేశారు. ఈ కేసులో బాధితురాలికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారి బంధువులకు అప్పగించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

విజయనగరం రింగురోడ్డు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తిగా నాణ్యతతో చేపట్టాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్య అన్నారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. గౌడువీధిలో నిర్మితమవుతున్న సీసీ రహదారిని, కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల వద్ద సూపర్‌వైజర్ ఉన్నారా.. లేరా.. అని అడిగి తెలుసుకున్నారు.

విజయనగరం రచయితల సంఘం కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రచయితల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం కుసుమ గజపతినగర్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా జీవీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సముద్రాల గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కేకే రఘునందనరావు, సంయుక్త కార్యదర్శులుగా నందివాడ చినదేవీ, అరసాడ శేషగిరి పట్నాయక్, కోశాధికారిగా భోగరాజు సూర్యలక్ష్మీ ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా నాలుగెస్సల రాజు, సలహాదారులుగా డాక్టరు డీవీజీ శంకరరావు, పప్పు భోగారావులను ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతమైన పౌరుడిగా..

జామి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జామిలో కొద్ది రోజులుగా పెద్ద వీధి నుంచి దిగువ వీధికి వెళ్లే రహదారి అపరిశుభ్రంగా ఉంది. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించలేదు. దీంతో మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు తన సొంత నిధులు ఉపయోగించి స్థానికులతో కలిసి ఆ రహదారిని శుభ్రం చేశారు. విషయం తెలిసిన పంచాయతీ అధికారులు వెంటనే అక్కడకు వచ్చి, చుట్టుపక్కల బ్లీచింగ్ జల్లించారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..

- మురుగుతో నిండిన కాలువలు
- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- ఇదీ బానాది గ్రామం దుస్థితి

వేపాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే.. కాలువల్లో రోజుల తరబడి మురుగు పేరుకుపోతోంది. దుర్వాసన వెదజల్లుతోంది. మరోపక్క దోమలు విజృంభిస్తున్నాయి. అసలే వర్షా కాలం.. ఇలాంటి పరిస్థితిలో ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇదీ వేపాడ మండలంలోని బానాది గ్రామం దుస్థితి. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోతున్నా, కాలువలు పూడుకుపోతున్నా కనీసం ఎవరూ పట్టించుకున్న పరిస్థితి కనిపించడం లేదు.

పారిశుధ్య పనులు చేయిస్తాం

ప్రస్తుతానికి బానాది పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. సర్పంచ్‌తో మాట్లాడి గ్రామ పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయిస్తాం.

- రవి, మండల పంచాయతీ విస్తరణ అధికారి



ఎస్సీ కాలనీ శివారులో చెరువు గట్టుపై వేసిన చెత్తకుప్ప



మురుగు కాలువ ఇలా..

ప్రజా సంక్షేమం కోసం కృషి

- చీపురుపల్లి ఎమ్మెల్యే కళా



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా

గుర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసమే టీడీపీ ఎల్లప్పుడూ పనిచేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. సోమవారం రౌతుపేట గ్రామంలో ఆయన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నాయకులు కేటీఆర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, సుంకరి రమణమూర్తి పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భోగాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రెడ్డికంచేరు గ్రామంలోని అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. రెడ్డికంచేరు గ్రామాన్ని ఆమె సోమవారం రాత్రి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

విజయనగరం రింగురోడ్డు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చాయి. కమిషనర్ నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి-1, ప్రజారోగ్య విభాగానికి-1, ఇంజనీరింగ్ విభాగానికి-2 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించిన కమిషనర్.. సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేష్

నెల్లిమర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పతివాడ రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనకు రెండోసారి ఈ పదవి దక్కడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తు న్నాయి. ఈయన గతంలో బీజేపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కూడా పనిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.



అశోక్‌ను కలిసిన టీడీపీ నాయకులు

గుర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని ఆయన బంగ్లాలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు సోమవారం కలిశారు. ఈసందర్భంగా అభినందనలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు ఉన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించండి

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం నగరంలోని 10, 11 డివిజన్ల పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రెండు డివిజన్ల పరిధిలో పలు ఇళ్లకు వెళ్లి ఏడాది పాలనలో ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రానున్న నాలుగేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

హామీలు అమలు చేయండి

- ఎమ్మెల్యే లలితకుమారిని కలిసిన జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదు.. తమ సమస్యలను తీర్చాలని మాత్రమే కోరుతున్నామని మండలంలోని జిందాల్ నిర్వాసితులు.. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని వేడుకున్నారు. వారు సోమవారం లక్కవరపుకోటకు చేరుకుని, ఎమ్మెల్యేను తన స్వగృహంలో కలిశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. న్యాయం కోసం శాంతియుతంగా పోరాడుతుంటే పోలీసులు బైండోవర్లు పెడుతున్నారని చెప్పారు. 'మీరే మాకు న్యాయం చేయాలి' అని వేడుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి అందుబాటులోకి వచ్చిన వెంటనే సమావేశం పెట్టి సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో సోమవారం బొండిలగూడేంలో అక్రమంగా నిర్మితమవు తున్న అదనపు భవన నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణలో భాగంగా అనేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా అనధికార అనుమతులు లేని కట్టడాలను తొలగి స్తున్నామన్నారు. అదనపు భవన నిర్మాణానికి నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరదనీటి సమస్యకు పరిష్కారం చూపుతాం

శృంగవరపుకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలోని విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని డీపీవో మల్లికార్జున తెలిపారు. విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిలిచి ఉన్న ప్రాంతాన్ని డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విశాఖ-అరకు రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఎంపీడీవో సతీష్, పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్ సత్యనారాయణకు సూచించారు. సమస్యను కలెక్టర్‌కు వివరించి, శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అంతవరకు స్థానిక వ్యాపారులు సహకరించాలని గొంప కృష్ణ కోరారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ ఐవీ లక్ష్మి, పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి వీవీ అనురాధ, వీఆర్వో ఎన్.రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు ఎం.మంగరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణతో చర్చిస్తున్న డీపీవో మల్లికార్జున

బీజేపీ జిల్లా నూతన పతాధికారుల నియామకం

విజయనగరం దాసన్నపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు పతాధికారులను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఈ జాబితాను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా పతాధికారులను నియమించామని చెప్పారు. చీపురుపల్లికి ఉప్పలపాటి రాజేష్‌వర్మ, కొండపల్లి శ్రీనివాసరావు, గజపతినగరానికి అరిశెట్టి సూర్యనారాయణ, నెల్లిమర్లకు దోమా కామేశ్వరీ, పతివాడ రాజేష్, నెక్కంటి ప్రదీప్‌కుమార్, రాజాంకు పెద్దింటి శ్రీదేవి, బొబ్బిలికి లింగాల సూర్యనారాయణ, ముగడ సాయి అనిల్, గుడివాడ నాగరాజు, బండి సూర్యనారాయణ, విజయనగరానికి నీలాపు దేవి, చింతపల్లి అప్పారావు, శనపర్తి జానకీ, తిప్పాన పావనీ, ఎస్.కోటకు చొక్కాకుల అప్పారావు, దాసరి రమణమ్మ, బొబ్బిలి వేమకోటి గిరిబాబు, సోషల్ మీడియా కన్వీనరుగా మజ్జి రామారావు, ఐటీ కన్వీనరుగా చందక శ్రీనివాసులను నియమిస్తూ రాజేష్‌వర్మ ప్రకటించారు.

పంట కాలువ పూడ్చేశారు

భోగాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని ఎత్తు బ్రిడ్జి సమీపంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పంట కాలువను కొందరు తమ స్వప్రయోజనాల కోసం పూడ్చేశారు. దీనిపై ఉప తహసీల్దార్ హరిని వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరిగేషన్ డీఈఈ గోవిందరావు ను వివరణ కోరగా ఏఈఈని పంపించి చర్యలు తీసుకునే విధంగా చూస్తామన్నారు.



పంట కాలువను పూడ్చేసిన దృశ్యం

ఎరువుల సమస్యను పరిష్కరించాలి

విజయనగరం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న ఎరువుల సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ నిరసనలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ● ఇదే విషయం జిల్లా వ్యవసాయ జేడీ తారకరామారావు వద్ద ప్రస్తావించగా.. రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

గ్రామాల్లో ఎరువుల కొరత లేదు

- మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

భోగాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడా ఎరువుల కొరత లేదని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. యూరియా కొరతపై వస్తున్న వార్తలను ఖండిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రైవేటు రిటైల్ వ్యాపారులతో పాటు ఆర్ఎస్‌కేలు, సొసైటీల ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతుందన్నారు. 50శాతం ఎరువులు ప్రైవేటు వ్యాపారస్థులకు, 50శాతం ఎరువులు ఏపీ మార్క్‌ఫెడ్‌కు కేటాయించి సొసైటీలకు, రైతు సేవా కేంద్రాలకు నిరంతరం ఎరువులు సరఫరా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 1,26,100 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఇండెట్లు వచ్చాయని, అందులో 1,12,717 మెట్రిక్ టన్నుల యూరియాను కొన్ని జిల్లాలకు సరఫరా చేశారని, మిగిలిన 13383 మెట్రిక్ టన్నుల యూరియా మరికొన్ని జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉందన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

- అంగన్‌వాడీల ఆందోళన

శృంగవరపుకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎస్.కోట స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందించారు. సెంటర్ నిర్వహణకు ఒక యాప్ మాత్రమే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.జయలక్ష్మి, కె.దమయంతి, కె.నాగజ్యోతి, వి.మాణిక్యం పాల్గొన్నారు. ● గజపతినగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలని ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిణీ, పి.జ్యోతి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్ కిందకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అలాగే 5జీతో కూడిన కొత్త ట్యాబ్‌లు అందజేయాలని కోరారు. అనంతరం పీవో రాజేశ్వరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ● భోగాపురం: ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



గజపతినగరం: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

వేపాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొండగంగుబూడి గ్రామ శివారు ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు పరవాడ పరమేశ్వరరావు(45) దమ్ము పడుతుండగా ట్రాక్టర్ బోల్తాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పరవాడ పరమేశ్వరరావు అనే రైతు సోమవారం సాయంత్రం తన సొంత పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము పడుతుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. దీనిని గమనించిన స్థానికులు వెళ్లి చూసేసరికి.. ట్రాక్టర్ కిందపడి పరమేశ్వరరావు మృతి చెంది ఉన్నాడు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, తల్లి అచ్చియ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు హైమావతి, లీలావతిలు ఉన్నారు. చిన్న కుమార్తె లీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.



ట్రాక్టర్ కింద పడిన పరమేశ్వరరావు

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్..

డెంకాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన ఐదో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 23న చింతలవలస 5వ బెటాలియన్ మెయిన్ గేటు ఎదురుగా 26వ జాతీయ రహదారిపై రామునాయుడు నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొంది. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్టణం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈయన భార్య సూర్యకాంతం మోపాడ పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. మృతదేహాన్ని విశాఖ నుంచి విజయనగరం మహరాజ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. స్వగ్రామం పద్మనాభం మండలం, కోరాడలో దహన సంస్కారాలు నిర్వహించనున్నారు. రామునాయుడు పోలీసు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఈయన అకాల మరణాన్ని ఇక్కడి అధికారులు, సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు.



రామునాయుడు (ఫైల్)

గడ్డి మందు తిని ఏడు మేకలు మృతి

- 150 మేకలు, గొర్రెలకు అస్వస్థత

మక్కువ రూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలంలోని డి.శిర్లాం సమీపంలోని పొలాల్లో సోమవారం గడ్డి మందు తిని 7 మేకలు మృతి చెందాయి. మరో 150 మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. గ్రామంలోని కాపారులు ఎప్పటి మాదిరిగానే 200 మేకలు, గొర్రెలను సోమవారం ఉదయం మేత కోసం డి.శిర్లాం, గోపాలపురం గ్రామాల మధ్యలో ఆయిల్‌పామ్ తోటలో విడిచిపెట్టారు. అప్పటికే ఆ తోటల్లో కలుపు మొక్కలు, గడ్డిని తొలగించేందుకు గడ్డిమందును సంబంధిత రైతులు చల్లారు. ఆ విషయాన్ని గొర్రెల కాపరులు గమనించలేదు. దాంతో అక్కడే మేస్తున్న మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురై కిందపడిపోయాయి. దీంతో భయాందోళన చెందిన కాపరులు గ్రామస్థులుకు విషయం తెలిపారు. వారు చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. అప్పటికే 7 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. 150 జీవులు అస్వస్థతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పశువైద్య సిబ్బంది మేకలు, గొర్రెలకు ప్రాథమిక చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు.

చిన్నశిర్లాం ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ

రేగిడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చిన్నశిర్లాం ఫీల్డ్‌అసిస్టెంట్ మజ్జి చిరంజీవిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా ఏపీడీ పద్మావతి సోమవారం ఆ గ్రామంలో విచారణ నిర్వహించారు. 2017, 2018 సంవత్సరాల్లో ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లతో పాటు పలు అవకతవకలకు పాల్పడినట్టు గ్రామ వేతనదారులు కొంతమంది ఇటీవల కలెక్టర్, ఉపాధి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ ఏడాది జూన్ 5న ఎంపీడీవో శ్యామలా కుమారి గ్రామంలో బహిరంగా విచారణ చేశారు. ఉపాధి పీడీకి నివేదిక అందించారు. అయితే ఈ విచారణ సరిగాలేదని మరోసారి ఫిర్యాదుదారులు జిల్లా అధికారులను ఆశ్రయించారు. దీనిపై కలెక్టర్, పీడీలు మరోసారి ఏపీడీని విచారణ అధికారిగా నియమించి వాస్తవ విషయాలు సేకరణకు ఆదేశించారు. ఈక్రమంలో ఏపీడీ సోమవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను, ఫీల్డ్ అసిస్టెంట్‌ను, ఆయా సంవత్సరాల్లో పనిచేసిన వేతనదారులను వేర్వురుగా విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దీనిపై కలెక్టర్, పీడీలకు సమగ్ర నివేదిక అందిస్తామని ఏపీడీ తెలిపారు. ఈ విచారణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విచారణలో రాజాం క్లస్టర్ ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, ఏపీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

తూడెంలో కొట్లాట.. ఇరువర్గాలపై కేసు

భోగాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): తూడెం గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. సోమవారం ఇరువర్గాలు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐ వి.పాపారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తూడెం గ్రామ సమీపంలో భూముల సరిహద్దులకు సంబంధించి రాళ్లు పాతుతుండగా ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. పైల రాముపై రామలక్ష్మి, ఉప్పిలి శ్రీను, ఉప్పిలి రాము, ఉప్పిలి అప్పలస్వామి దాడి చేశారు. గాయపడిన రాముకు చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఉప్పిలి రామలక్ష్మిని పైల రాము, పైల అప్పలనర్సయ్య, దువ్వు రాంబాబు గాయపరిచారు. గాయాలపాలైన ఆమెను సుందరపేట ఆసుపత్రిలో చేర్చారు. రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌లో రూ.70వేలు నష్టం

రాజాం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామంలో గల లక్ష్మనాయుడుకు చెందిన ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నుంచి పొగలు బయటకు రావడంతో సమీప గృహస్థులు గమనించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. సకాలంలో అగ్నిమాపక అధికారి అశోక్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.70వేలు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు.

సారా స్థావరాలపై దాడులు

కురుపాం, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని సారా తయారీ స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సరిహద్దులోని సందుబడి గ్రామం సమీపంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 5600 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం చేశామన్నారు. తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, పాత్రలు, 760 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో విజయనగరం, సాలూరు, గజపతినగరం, పార్వతీపురం, కురుపాం ఎక్సైజ్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

గుర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. దేవునికనపాక గ్రామంలో అక్రమంగా సారా తయారు చేస్తున్న విషయం తెలుసుకుని దాడి చేశామని ఆయన చెప్పారు. ఈ దాడిలో 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరి అరెస్టు

సీతంపేట రూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): టిటుకుపాయిగూడ సమీపంలో దోనుబాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 20 లీటర్ల సారా తరలిస్తున్న నిమ్మక రామారావు, బిడ్డిక సుమన్‌లను అరెస్టు చేశారు.

చంద్రబాబు కాదు.. మీరే రద్దు చేశారు

(5వ పేజీ తరువాయి)

అడ్డుతగులుతూ మీకు కేటాయించిన ఇంటిని చంద్రబాబు రద్దు చేశారంటూ చెప్పబోయారు. దీనికి ఆ వృద్ధురాలు ఎదురు తిరుగూ 'నాకు ఇంటికోసం ఎన్నిసార్లు నీ వద్దకు తిరిగాను. ఓ మనిషిని పంపించావు. ఇల్లు ఇచ్చారా' అని ప్రశ్నించింది. అప్పట్లో మీరే నా ఇంటిని రద్దు చేసి ఇప్పుడు చంద్రబాబుపైకి నెట్టేస్తారా? అని నిలదీసింది. దీంతో వైసీపీ నాయకులకు నోటమాట రాలేదు. ఇంకా ఆ వృద్ధురాలు తమకు కడిగేస్తుందేమోనని అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు.

ఆడలి.. తగ్గిన తాకిడి!

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. ఈ నేపథ్యంలో వ్యూపాయింట్‌కు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

ధరలు ఇలా..

ఆడలి వ్యూపాయింట్ నిర్వహణకు సంబంధించి గత ఏడాది ఐటీడీఏ అధికారులు ఐదేళ్ల లీజు ప్రాతిపదికన ఆన్‌లైన్ టెండరింగ్ నిర్వహించారు. ఏడాదికి రూ.6లక్షల చెప్పున చెల్లించేందుకు ఎం.విజయచంద్ అనే టెండర్‌దారుడు ముందుకొచ్చారు. అయితే సంబంధిత లీజుదారుడు ఆడలి వ్యూ పాయింట్‌కు వచ్చే పర్యాటకుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా వ్యూపాయింట్ ప్రవేశ మార్గంలో చెక్‌పాయింట్ వద్ద ఎంట్రీ టికెట్ రూ.30 చొప్పున ఒక్కొక్కరి వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. అదేవిధంగా ఫొటోషూట్‌కు రూ.200, వెడ్డింగ్ షూట్(వీడియో షూట్)కు రూ.1000గా ధర నిర్ణయించారు. దీంతో పర్యాటకులు బెంబేలెత్తిపోతున్నారు. వ్యూ పాయింట్ చూసేందుకు వచ్చే పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా పెద్ద మొత్తంలో వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఐటీడీఏ అధికారులు దృష్టిసారించాలని సందర్శకులు కోరుతున్నారు.

ఆలస్యంగా రక్షణ చర్యలు

ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో ఐటీడీఏ అధికారులు ఆలస్యంగా రక్షణ చర్యలు చేపట్టారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా బిడింది గూడ, వెలంగూడ, బుడ్డదుగూడతో పాటు నాలుగో మలుపు వద్ద రూ.1.20కోట్లతో రక్షణ గోడలను నిర్మిస్తున్నారు. ఒక్కో రక్షణ గోడ నిర్మాణానికి రూ.30లక్షలు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రెండు మలుపుల వద్ద పనులు చివరి దశకు చేరుకున్నాయి.

అర్హుల జాబితాపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

పథకం కింద కుటుంబలో ఒకరికి మాత్రమే రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. నమోదుకు ఎలాంటి గడువు విధించలేదు. ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం కానివారు, భూమి కొనుగోలు దారులు, వెబ్‌ల్యాండ్‌లో పేరు మారినవారు ఉంటే రైతుసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మన్యంలో అర్హులైన రైతులను గుర్తించామని, త్వరలోనే వారి ఖాతాల్లో అన్నదాతా సుఖీభవ పథకం కంద రూ.20 వేలు జమకానుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ అన్నదాతా సుఖీభవ పథకం వర్తిస్తుందని, కూటమి ప్రభు త్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.

తప్పిదాలు జరగకుండా చూడాలి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాలూరు మండలం కొదమ పంచాయతీ రైతులకు చెందిన రైతుభరోసా నగదు అదే మండలంలోని శివరాంపురంలో ఉన్న సుమారు 20 మందికిపైగా ఖాతాల్లో జమైంది. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వల్ల వారి ఖాతాల్లోంచి తిరిగి డబ్బులు తీసుకోవడానికి జిల్లా అధికారులు తలలుపట్టుకున్నారు. అయితే ఇటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రతి వసతిగృహానికీ ప్రత్యేకాధికారి

(5వ పేజీ తరువాయి)

అయ్యాయన్నారు. మిగిలిన 20 వేల కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భామిని, వీరఘట్టం మండలాల్లోని ఆదర్శ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించాలన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో మట్టికి జీవం

పచ్చిరొట్ట ఎరువులతో మట్టికి జీవం వస్తుందని, భూమి సారవంతమవుతుందని కలెక్టర్ తెలిపారు. జీవన ఎరువులతో పంటకు బలం వస్తుందన్నారు. పది శాతం ఎరువులు ఆదా చేయొచ్చని తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ రూపొందించిన పచ్చిరొట్ట విత్తనాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ

కొమరాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్వామి సేవాసమితి సభ్యులు ఆరు సీలింగ్ ఫ్యాన్‌లను సోమవారం హెచ్‌ఎం గౌరీశంకరరావుకు అందజేశారు. కార్యక్రమంలో స్వామి సేవా సమితి సభ్యుడు రామ్మోహన్‌రావు, ఎంఈవో-2 జి.చినతిరుపతిరావు, టీడీపీ అరకు పార్లమెంట్ పార్లమెంట్ రైతు కమిటీ అధ్యక్షుడు డి.వెంకటనాయుడు, టీచర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలు మంజూరు చేయండి

పార్వతీపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను తమకూ వర్తింపజేయాలని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ తమకు వచ్చే వేతనం రూ.10 వేలలో రూ.3 వేలను ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ఖర్చు పెడుతున్నామన్నారు. మిగిలిన రూ.7 వేలతో కుటుంబాలతో జీవనం గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులకు వారు వివరించారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

గుమ్మలక్ష్మీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీఐ శ్రీహరి కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి యువతతోనే సాధ్యమన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కారదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కల్పన శ్రీవాణి, తులసి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

భూఆక్రమణలను అడ్డుకోండి

పాలకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధ్య సర్వే నెంబర్లు 20-1బి, 2బిలో విలువైన ప్రభుత్వ భూమిని పాలకొండకు చెందిన కొంతమంది ఆక్రమణకు యత్నిస్తున్నారని దళిత సంఘాల నాయకులు బత్తిన మోహన్, గురుబిల్లి రవికుమార్, ఆరోపించారు. దాన్ని అడ్డుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం



బలిజిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

బలిజిపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. బలిజిపేటలో సోమవారం మధ్యాహ్నం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బలిజిపేటలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైసీపీ నాయకులు ఇంటింటా ప్రచారానికి వస్తే కూటమి చేసిన అభివృద్ధిని వివరించి నిలదీయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.రామ్మోహన్, వెంకటనాయుడు, పాపినాయుడు, రాజశేఖర్, రాంబాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

● పణుకువలసలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు, అరుకు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రామ్మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఎస్.రాంబాబు, బి.బాబ్జి, నాయకులు ఎం.సూర్యనారాయణ, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

● బలిజపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.23.10 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

సాగునీరు విడుదల...

మండలంలోని సువర్ణముఖి ప్రధాన కాలువ నుంచి ఎమ్మెల్యే విజయచంద్ర సోమవారం సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ప్రసాదరావు, బీఏ నారాయణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాలనాయుడు, కొప్పల వెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, పెదంకలాం ఆయకట్టు చైర్మన్ శంబాన గౌర్నాయుడు, వైస్ చైర్మన్ మండల పెదపాపినాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

పార్వతీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించారాదని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ ఎస్.ఎస్.శోబిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సంధ్యారాణి 148 వినతులను స్వీకరించారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులును కలెక్టర్ ఆదేశించారు. ●ఈ సందర్భంగా పార్వతీపురం మంలం కోటవానివలసకు చెందిన అల్లు ఆద్యశ్రీకి మూడు చక్రాల సైకిల్, జీఎంవలసకు చెందిన ఎన్.గిరిధర్‌పాత్రోకు హియిరింగ్ పరికరాలను కలెక్టర్ పంపిణీ చేశారు.

ఆధార్‌కార్డు కోసం ఎదురుచూపు

పార్వతీపురం/టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుతో పాటు పింఛన్లు ఇప్పించాలని కలెక్టర్ శ్యామ్ సుందర్‌ను వేడుకున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కరవేదిక (పిజిఆర్‌ఎస్)లో పట్టణంలోని కుద్దిలి వీధికి చెందిన మానసిక వికలాంగురాలు సిండిగి ప్రసన్న ఆధార్‌తో పాటు ఫింఛన్ సౌంకర్య కల్పించాలని, తల్లి సింగిడి లక్ష్మీ.. కలెక్టర్‌కు వినతపత్రాన్ని అందించింది. అంతే కాకుండా 10 ఏళ్ల క్రితం తన భర్త అకస్మాత్తుగా చనిపోవడంతో కటుంబం వీధిన పడిందని,తనకు ఫింఛన్ సౌకర్యం కల్పించాలని లక్ష్మీ కలెక్టర్‌ను వేడుకుంది. ●మా కుటుంబాలకు 35 కేజీల చొప్పున బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మండలం పెదబొండపల్లికి చెందిన వికలాంగులు అల్లం సురేష్, బోడరాములమ్మలు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు విన్నవించుకున్నారు. కొన్నేళ్లుగా 5 కేజీల బియ్యాన్ని రేషన్ డిపో ద్వారా అందుతున్నప్పటికీ మా కుటుంబాలకు చాలడం లేదని కలెక్టర్‌కు తెలిపింది. ●సీతానగరం మండలం రంగంపేట గ్రామానికి చెందిన ఆర్.నారాయణరావు అనే పారిశుధ్య కార్మికుడు తనకు కరోనా సమయంలో రావాల్సిన వేతనాన్ని మంజూరు చేయాలని కోరారు. ● సాలూరు నియోజకవర్గ పరిధిలో విశ్వనాధపురం గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు తాము నిర్మించుకున్న ఇళ్లలకు సంబంధించి బిల్లులు మంజూరు చేయలేదని ఫిర్యాదు చేశారు.●పార్వతీపురంలో ఉన్న జగన్నాథపురానికి చెందిన ఎన్.యమున తన కుమార్తెలకు రావాల్సిన తల్లికి వందనం మంజూరు కాలేదని, మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిప త్రం అందించారు.

నలుగురు కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు

పార్వతీపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీతానగరం మండలం జోగింపేట పంచాయతీకి చెందిన నలుగురు గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. జోగింపేట పంచాయతీలో రూ. 33 లక్షల 32 వేల 652 రూపాయలు నిధులు పక్కదారి పట్టడంపై డీఎల్‌పీవో నాగభూషణరావు దర్యాప్తు నిర్వహించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయడంతో నలుగురు కార్యదర్శులు డి.శ్రీనివాస్, ధనలక్ష్మీ, కిరణ్, పైడిరాజులపై సస్పెన్షన్ వేటు పడిందని డీపీవో తెలిపారు.

దేవస్థానం అభివృద్ధికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని ఆలయ అభివృద్ధి సేవాట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. సోమవారం వీరఘట్టానికి చెందిన నల్లాన సాంబశివరావు జ్ఞాపకార్థం రవికుమార్, రామ్మోహనరావు, రాజారావుతో పాటు పలువురు రూ. 1,00,116 విరాళం అందించారన్నారు. గతంలో తోటపల్లి అభివృద్ధికి డాక్టర్ నల్లాన ప్రత్యేక కృషి చేశారన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించి తోటపల్లికి తగిన గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం



ప్రచారం చేస్తున్న ద్వారపురెడ్డి

గరుగుబిల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అరకు టీడీపీ బీసీ విభాగం అధికార ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం చిలకాం పంచాయతీ చిలకాం, కారివలస, దత్తివలస గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.గౌరమ్మతో పాటు యేగిరెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 95 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి గిరిజనుల నుంచి 95 వినతులు స్వీకరించారు. అటవీ పట్టా మంజూరు చేయాలని కొత్తగూడ గ్రామానికి చెందిన సవర ప్రశాంత్‌కుమార్ కోరారు. డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసుకునేందుకు రుణం మంజూరు చేయాలని కె.కూర్మారావు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ పోస్టు ఇప్పించాలని ఊర్లక శారద, భూ సర్వే చేసి పట్టా ఇప్పించాలని బి.రాములు విన్నవించారు. పొలానికి విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయించాలని నిమ్మక రామారావు, పేపర్ ప్లేట్స్ తయారీ యూనిట్ ఇప్పించాలని కె.నారాయణ, పసుపు బాయిలర్ మిషన్ ఐటీడీఏ ద్వారా ఇప్పించాలని ఆరిక జమ్మయ్య కోరారు. కార్యక్రమంలో పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, టీడబ్ల్యూ ఈఈ కుమార్, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ శ్రీహరి, ఏవో వాహని, జీసీసీ బీఎంలు డి.కృష్ణారావు, నర్సింహులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

వీరఘట్టం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడగమ్మ గ్రామంలో తాగునీటి సమస్య తీరనుంది. ఇటీవల కిమ్మి గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రజాదర్బార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. గడగమ్మ గ్రామానికి చెందిన ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఎమ్మెల్యే స్పందించారు. తాగునీటి సమస్య తీర్చాలని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ కావ్యశ్రీని ఆదేశించారు. దాంతో జలజీవన్ మిషన్‌లో భాగంగా పనులను వేగవంతం చేశారు. ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు.

పాఠశాలల మరమ్మతులపై సర్వే

జియ్యమ్మవలస, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 ట్రైబల్ వెల్ఫేర్ జీపీఎస్ పాఠశాల, అలాగే రావాడ రామభద్రపురం, టీకే జమ్ము, పీటీ మండ, వనజ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల భవనాల మరమ్మతులపై సర్వే నిర్వహించి నివేదికలను తక్షణమే ఇవ్వాలని ఐటీడీఏ ఏఈ పి.రమేష్ కోరారు. సోమవారం ఎంపీడీవో కె.ధర్మారావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. నీలకంఠాపురం, చిలకలవానివలసల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. పందుల వానివలసలో విలేజ్ రిసోర్స్ సెంటర్ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే డ్రాక్షిణి గిరిజన గ్రామానికి సుమారు రెండు కిల మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 లక్షలకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

జనసేనలో పలువురి చేరిక

గుమ్మలక్ష్మీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండల నాయకుడు అధికారి అనీల్ ఆధ్వర్యంలో దిగువమండ గ్రామానికి చెందిన మండంగి సుజిత్‌కుమార్ సమక్షంలో కురపాం నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు చేతుల మీదుగా మండ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులతో పాటు 70 కుటుంబాలు సోమవారం జనసేన పార్టీలో చేరారు. గుమ్మలక్ష్మీపురం జనసేన మండల నాయకుడు అధికారి అనీల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. దిగువమండ గ్రామానికి చెందిన మండంగి సుజిత్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు ఆరిక కంచన, సులోచన, కిల్లక సత్యవతి, ఆరిక హరిశ్చంద్రుడు, కిల్లక రాఘవేంద్ర, లీపక నాగభూషణరావు, వినోద్, రమేష్, మూటక శంకరరావు, హిమరిక వినోద్ కుమార్, కిల్లక కుమార్, మరో 70 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీశంకర్, దుమ్మంగి సర్పంచ్ క్రాంతి, కొమరాడ మండల పార్టీ అధ్యక్షుడు తెంటు శ్రీకర్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయండి

పాలకొండ, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని పాలకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం సాయంత్రం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పీడీపీవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎం.హిమప్రభ, జెస్సీబాయి, ధనలక్ష్మీ, రాజులమ్మ, శారద, శ్యామల, శ్రీదేవి, శారద తదితరులున్నారు.

●పార్వతీపురం రూరల్: అంగన్వాడీ కేం ద్రాల్లో ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ పార్వతీపురం సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరి, పార్వతీపురం యూనియన్ ప్రాజెక్టు ప్రతినిధులు గౌరిమణి, రాజేశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

●సాలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అమలు చేస్తున్న ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేశారు. సాలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం వారు ఆందోళన నిర్వహించారు. కార్య క్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు బడ్నాన శశికళ,దండి పార్వతి, పుష్ప, జానికి, ఇందిర, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా పులిగుమ్మి, కొత్తతొడుములో తాగునీరు ట్యాంక్‌లను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌పాత్రుడు, కురపాం ఏఎంసీ వస్ చైర్మన్ గార గౌరీశంకర్, నాయకులు తెంటు శ్రీకర్, బలరాం, రాఘవ, బత్తిలి శ్రీను, మోహన్‌రావు, సర్పంచ్‌లు సింహాచలం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

గుమ్మలక్ష్మీపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కురపాం గ్రామానికి చెందిన నందిన శ్రీదేవి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుం రూ.53,836 మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును శ్రీదేవి కుటుంబ సభ్యులకు గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, సుకేష్ చంద్ర పండా, ప్రసాదరావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

●పార్వతీపురం రూరల్: బలిజిపేట మండలం తుమరాడ గ్రామానికి చెందిన వి.రవికుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కును క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం అందించారు. ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో చెక్కును అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నారని వివరించారు.

వీఆర్‌ఎస్ నుంచి నీరు విడుదల

మక్కువ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర సమీపంలో వెంగళరాయసాగర్ జలాశయం ప్రధాన గేట్ల నుంచి సోమవారం రాత్రి సువర్ణముఖి నదిలోకి నీటిని విడుదల చేశారు. జలాశయం నీటి మట్టం 161 మీటర్లకు గాను ప్రస్తుతం 160. 4 మీటర్లకు చేరడంతో ప్రధాన గేట్లు ఎత్తేశారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో కురుస్తున్నర వర్షాలకు సాలూరు మండలం మామిడిల్లి సువర్ణముఖి నదిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరి జలాశయంలో కలవడంతో 500 క్యూసెక్కుల వరదనీటిని విడిచిపెట్టారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ జేఈ రాజశేఖర్ తెలిపారు.

రైతులకు మర్యాదలు

సాలూరు రూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం వచ్చిన రైతులకు కుర్చీలు వేసి కూర్చోబెట్టి మర్యాద చేశారు. ఈ ఘటన సాలూరు మండలం శివరాంపురం పీఏసీఎస్ వద్ద సోమవారం జరిగింది. ఇటీవల యూరియా కోసం వివిధ గ్రామాలు నుంచి వచ్చిన రైతులను పీఏసీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షంలో నిలబడి తమ వంతు వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చింది. కొద్దిరోజుల క్రితం శివరాంపురం పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా కనకల సూర్యనారాయణ, మెంబరుగా చొక్కాపు త్రినాథ్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. కొత్త పాలకవర్గం చేపట్టిన తదుపరి తొలిసారిగా శివరాంపురం పీఏసీఎస్‌కు యూరియా, డీఏపీ ఎరువులొచ్చాయి. వీటి పంపిణీకి కొత్తపాలకవర్గం రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టింది. శివరాంపురంలో ఉన్న కల్యాణ మండపంలో రైతులకు కుర్చీలు వేసి కూర్చోబెట్టారు. వారి వరుస వచ్చినప్పుడు యూరియా, డీఏపీలను పిలిచి బిల్లు రాసి అందించారు. 267 మంది రైతులకు 534 బస్తాల యూరియాను సజావుగా పంపిణీ చేశారు. కొత్తపాలక వర్గం చేపట్టిన చర్యలను రైతులు అభినందించారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన

●గరుగుబిల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఎరువుల కోసం ఆందోలన చెందుతున్నారు. సోమవారం మండలంలోని చినగుడబలో రైతుసేవా కేంద్రానికి ఎరువుల కోసం రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నారుమళ్లకు యూరియా, డీఏపీ అవసరమైతే ఒక రైతుకు ఒక బస్తా చొప్పున ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వరి ఉబాలుకు యూరియా, డీఏపీలు అవసరమని, ముందస్తుగా కొనుగోలు చేసి సిద్ధం చేసుకుందామన్నా సరైన నిల్వలు లేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బయట కొందామంటే ప్రైవేటు వర్తకులు నిబంధనలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలకు మొదటిగా 204 మెట్రిక్ టన్నుల యూరియా, 143 మెట్రిక్ టన్నుల డీఏపీను అందించడం జరిగిందన్నారు. యూరియా, డీఏపీ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి రెండో ధపా 60 మెట్రిక్ టన్నుల యూరియా, 20 మెట్రిక్ టన్నుల డీఏపీను రెండు రోజుల్లో సరఫరా కానుందన్నారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితాకు కృషి చేయాలి

పాలకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఓటర్ల జాబితాకు కృషి చేయాలని తహసీల్దార్ సి.హెచ్.రాధాకృష్ణమూర్తి అన్నారు. కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్లు జాబితాలు తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు కచ్చితంగా ఉండాలని ఈసీ నిర్ణయించిందన్నారు. అందుకు తగ్గట్టు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

పార్వతీపురం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్తవలస కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను సోమవారం ఘనంగా నిర్వహించారు వ్రతాల్లో 30 మంది దంపతులు పాల్గొన్నట్లు కళింగ వైశ్య సంఘం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ సంఘం నుంచి మంచి మంచి కార్యక్రమాలను చేపడుతున్నామని, దీనికి సంఘ సభ్యులు సహకరిస్తూ విజయవంతం చేస్తున్నారన్నారు.

ఆరోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించండి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు పక్కగా నిర్వహించి ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం బూర్జ గ్రామంలో సంచార చికిత్స వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, చికిత్స వివరాలను రికార్డుల్లో పరిశీలించారు. రికార్డుల్లో అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, సీహెచ్‌వో గాయత్రి, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.